ఆంధ్రజ్యోతి


andhrajyothy.com

మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.6 ; కనిష్ఠం 21.4

కామారెడ్డి
జిల్లా వార్తలు

5

బుధవారం 18 జూన్ 2025





పిల్లర్ల స్థాయిలోనే ఉన్న బాలుర వసతి గృహం

కొనసాగుతున్న బాలికల వసతి గృహ పనులు

మెడికల్ కళాశాల నిర్వహణపై.. ఎన్ఎంసీ అసంతృప్తి!

- మూడేళ్ల క్రితం జిల్లా మెడికల్ కళాశాలకు అనుమతులు
- ఇంకా కొనసాగుతున్న నిర్మాణ పనులు
- ఈ ఏడాది మరో 100 మంది విద్యార్థుల రాక
- మెడికల్ కళాశాల నిర్వహణపై ఎన్ఎంసీ అసంతృప్తి
- ప్రజలకు, రోగులకు తగ్గట్టుగా సరిపోని జీజీహెచ్ భవనం

కామారెడ్డి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మెడికల్ కళాశాల నిర్వహణపై ఎన్ఎంసీ అసంతృప్తి వ్యక్తం చేసింది. రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల విస్తరణలో భాగంగా గత మూడేళ్ల కిందట జిల్లాకు అప్పటి ప్రభుత్వం మెడికల్ కళాశాలను మంజూరు చేయగా జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) అనుమతులు ఇచ్చింది. దీంతో అదే ఏడాది ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో 100 సీట్ల భర్తీ ప్రక్రియ చేపట్టారు. విద్యార్థులకు సరిపడ భవనాలు లేకపోవడంతో దేవునిపల్లి పీహెచ్‌సీ వద్ద నిర్మించిన ఎంసీహెచ్ భవనాన్ని మెడికల్ కళాశాలకు కేటాయించారు. తరగతి గదుల కోసం తాత్కాలిక రేకులషెడ్లు వేసి తరగతులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు రెండు బ్యాచ్‌ల తరగతులు ప్రారంభం కాగా మరో రెండు నెలల్లో మరో బ్యాచ్ రానుంది. దీంతో కళాశాలలో 300 మంది విద్యార్థులు విద్యను అభ్యసించనున్నారు. గత మూడేళ్లుగా కళాశాల నిర్మాణ పనులు కొనసాగుతునే ఉన్నాయి. ఎంసీహెచ్ నిర్మాణమైన తర్వాత దాని పక్కనే 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్‌ను రూ.23 కోట్లతో నిర్మాణం చేపట్టారు. ఆ పనులు సంవత్సరాల కొద్ది కొనసాగుతునే ఉన్నాయి. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ కళాశాలలోని వసతులు, సౌకర్యాల కల్పన, సిబ్బంది పని తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. నేడు ఢిల్లీలో జరిగే విచారణకు ఆరోగ్యశాఖ కార్యదర్శి, వైద్య విద్య సంచాలకులు, యూజీఎంఈబీ డైరెక్టర్‌లు హాజరు కావాలని ఎన్ఎంసీ ఆదేశించింది. దీంతో కామారెడ్డి కళాశాలపై సైతం చర్చకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

ఏళ్ల నాటి భవనంలోనే కొనసాగుతున్న జీజీహెచ్ ఆసుపత్రి

కామారెడ్డి నియోజకవర్గ కేంద్రంగా ఉన్నప్పుడు ఏర్పాటు చేసిన ఏరియా ఆసుపత్రిలోనే జిల్లా కేంద్రంగా మారిన తర్వాత జిల్లా ఆసుపత్రిగా మారింది. ప్రస్తుతం మెడికల్ కళాశాల ఏర్పాటు కావడంతో జీజీహెచ్‌గా మార్చారు. వాస్తవానికి ఆ భవనం ప్రజలకు తగ్గట్టుగా సరిపోదని ఎప్పటి నుంచో విమర్శలు ఉన్నాయి. కానీ అదే భవనంలో ఎంసీహెచ్ అనుమతుల కోసం మరో ఫ్లోర్ నిర్మించి ఎంసీహెచ్ అనుమతులు వచ్చేలా చేశారు. ఆ తర్వాత కళాశాల భవనాన్ని దేవునిపల్లిలో ఉన్న ఎంసీహెచ్ భవనంలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం జీజీహెచ్ ఆసుపత్రికి ప్రజలు, రోగుల తాకిడి మరింత పెరిగింది. మెడికల్ కళాశాల ఏర్పాటు చేసిన సమయంలో యుద్ధ ప్రతిపాదికన పనులు చేపట్టాల్సి ఉండగా ఏళ్ల కొద్ది భవనాల నిర్మాణం సాగుతుండడంతో ఇటీవల ఎన్ఎంసీ బృందం తనిఖీలకు వచ్చిన సమయంలో సైతం పెదవి విరిచినట్లు సమాచారం.

(మిగతా 8వ పేజీలో)



కొనసాగుతున్న కళాశాల భవన నిర్మాణ పనులు



క్రిటికల్ కేర్ యూనిట్ పనులు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

క్షేత్రస్థాయిలో భూ సమస్యలను పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో పరిశీలించి భూ సమస్యలను పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ ఆదేశించారు. మంగళవారం కామారెడ్డి పట్టణంలోని 1వ వార్డులో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సును పరిశీలించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకున్న రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం ధరణి స్థానంలో భూ భారతి చట్టంను తీసుకువచ్చిందని తెలిపారు. రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుని భూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని సూచించారు. భూ భారతి రెవెన్యూ సదస్సులలో స్వీకరించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రెవెన్యూ రికార్డులను సరి చూసుకుని రెవెన్యూ భూ భారతి చట్టం మార్గదర్శకాల ప్రకారం పరిష్కరించాలని, అన్ని దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని తహసీల్దార్ జనార్ధన్‌కు ఆదేశించారు.

పంటలను ఎగుమతులు చేయాలి

జిల్లాలో మంచి క్వాలిటీ గల బియ్యం, మొక్కజొన్న, సోయాబీన్ పంటలు పండుతున్నాయని వీటిని సరైన పద్ధతిలో మార్కెటింగ్, ఎగుమతి చేస్తే జిల్లాకు మంచి గుర్తింపు వస్తుందని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిబ్రవరిలో జరిగిన మొదటి డీఎల్ఈపీసీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై సమీక్షించారు. మొదటి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో అధికారులు అసహనం వ్యక్తం చేశారు. జిల్లా పరిశ్రమల అధికారుల సలహాలు తీసుకుని జిల్లాలోని వ్యాపారులు, మిల్లర్లు హైదరాబాద్‌లోని కామర్స్ అండ్ ఎక్స్‌పోర్టు శాఖ వారితో సంప్రదించి జిల్లా నుంచి మంచి క్వాలిటీ గల రైస్, మొక్కజొన్నలు, సోయాబీన్ ఎగుమతి చేయాలని తెలిపారు. జిల్లా నుంచి నాణ్యమైన ఉత్పత్తులు ఎగుమతి అయ్యేలా పరిశ్రమల శాఖ అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని జీఎండీఐసీ లాలు నాయక్‌కు ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలో మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడంలో భాగంగా జిల్లా మహిళ సమైక్య ద్వారా ఒకరైస్ మిల్లును, ఒక పెట్రోల్ పంపును ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ శైలాజ, ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేష్ నాయక్, డీఆర్‌డీఓ సురేందర్, డీఏవో తిరుమల ప్రసాద్, ఎల్‌డీఎం చంద్రశేఖర్, జిల్లా మార్కెటింగ్ అధికారి రమణ, రైస్‌మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు కామారెడ్డిలో ఒలంపిక్ రన్

కామారెడ్డి టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా ఒలంపిక్ రన్‌ను గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నామని ఒలంపిక్ రన్ కన్వీనర్ నల్లవెల్లి కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఈ రన్‌ను బాలుర ప్రభుత్వ పాఠశాల నుంచి ప్రారంభమై ఇందిరాగాంధీ స్టేడియం వద్ద ముగుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు కమిటీ సభ్యులు, వ్యాయామ సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, యువకులు, క్రీడాకారులు, వాకర్స్ అసోసియేషన్ తదితర సంఘాల అందరూ పాల్గొనాలని తెలిపారు.



శబరిమలలో అయ్యప్ప స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు

శబరిమలలో అయ్యప్ప స్వామిని దర్శించుకున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలోని శబరిమలలో బంగారు కోవెలలో కొలువై ఉన్న కలియుగ దైవం అయిన శ్రీ అయ్యప్ప స్వామిని మంగళవారం తెల్లవారు జామున ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు తనయుడు కార్తీక్‌రావుతో కలిసి దాదాపు ఏడు కిలో మీటర్ల చిన్న పాదం కొండ కాలినడకతో వెళ్లి దర్శించుకున్నట్లు తెలిపారు. కేరళ ట్రావెల్ కోర్ సంస్థానం అధికారులు ప్రొటోకాల్ ప్రకారం దర్శనం కల్పించినట్లు తెలిపారు.



వెల్లుట్లలో దేవతలకు బోనాలు తీసుకెళుతున్న మహిళలు

వెల్లుట్ల, అడవి లింగాలలో బోనాల పండుగ

ఎల్లారెడ్డి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్ల, అడవి లింగాల గ్రామాల్లో ఉన్న ముత్యాల పోచమ్మ నల్ల పోచమ్మకు మంగళవారం ఉదయం నుంచి పూజలు నిర్వహించి సాయంత్రం ఆడపడుచులు ఇంటి నుంచి బోనాలు అలంకరించి ప్రధాన వీధుల గుండా బోనాలు ఎత్తుకొని భాజా భజంత్రాలు, పోతరాజుల విన్యాసాలతో అమ్మవారి ఆలయానికి వెళ్లి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం ఆనవాయితీ లాగా అమ్మవార్లకు బోనాలు సమర్పిస్తామని గ్రామస్థులు తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు పండాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, బంధువులు పాల్గొన్నారు.

రూ.169.48 కోట్ల రైతు భరోసా నిధుల జమ

కామారెడ్డి టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని 2,47,908 మంది రైతుల ఖాతాలో రైతు భరోసా నిధులు రూ.169.48 కోట్ల నిధులు జమచేయడం జరిగిందని డీఏవో తిరుమల ప్రసాద్ తెలిపారు. కామారెడ్డి నియోజకవర్గంలో 59,364 మంది రైతులకు గాను 40.07 కోట్లు, ఎల్లారెడ్డిలో 87,777 మందికి గాను 59 కోట్లు, జుక్కల్‌లో 73,230 మందిగాను 53.02 కోట్లు, బాన్సువాడలో 27,537 మందికి గాను 17.36 కోట్ల నిధులు జమచేశామని తెలిపారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లల్లో మరమ్మతులు చేపట్టాలి

అడిషనల్ కలెక్టర్ విక్టర్



భిక్కనూరులో డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలిస్తున్న దృశ్యం

భిక్కనూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండల కేంద్రంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లలో మరమ్మతులు చేపట్టాలని అధికారులను జిల్లా అడిషనల్ కలెక్టర్ విక్టర్ ఆదేశించారు. గత ప్రజావాణిలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు డబుల్ బెడ్‌రూం ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలని వినతి పత్రాన్ని అందజేయగా మంగళవారం కలెక్టర్ ఆదేశాల మేరకు అడిషనల్ కలెక్టర్ మండల కేంద్రంలోని డబుల్‌బెడ్ రూం ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వాటిని ప్లంబింగ్, కరెంట్ సామాను చోరీ కావడం, ధ్వంసం కావడం పట్ల షాకయ్యారు. ఈ ఇళ్లు పూర్తి అయిన లబ్ధిదారులకు ఇప్పటికీ ఎందుకు ఇవ్వలేదని అడిషనల్ కలెక్టర్ స్థానిక నాయకులను, అధికారులను అడగగా నీటి సమస్య కారణంగానే ఇళ్లను అప్పుడు పంపిణీ చేయలేదని వివరించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ నీటి కనెక్షన్‌ను వెంటనే పూర్తి చేయాలని, గదులలో మరమ్మతులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కాగా డబుల్ బెడ్‌రూం ఇళ్ల జాబితాలో వచ్చిన తన పేరును కొందరు తొలగించారని, లబ్ధిదారులు ఇళ్లను త్వరగా తమకు అందజేయాలని అడిషనల్ కలెక్టర్‌కు విన్నవించారు. పనులను త్వరగా పూర్తిచేసి అందజేస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీని సందర్శించి సిబ్బంది రిజిస్టర్, ఓపీ రిజిస్టర్, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రిలో గర్భిణులు కాన్పు చేయించుకునేలా కృషి చేయాలని, సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. ఆసుపత్రిలో పచ్చదనం బాగుందని సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వీణ, డీఎల్‌పీవో శ్రీనివాస్, పీఆర్ ఈఈ స్వామిదాస్, ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తునికి వేణు, మండల వైద్యాధికారిణి యేమిమా, వైద్యురాలు దివ్య, ఆర్ఐ బాలయ్య, గ్రామ పంచాయతీ ఈవో మహేష్‌గౌడ్, వింఢో ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సీతక్కను కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి

జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిని కలిసిన చంద్రశేఖర్‌రెడ్డి

కామారెడ్డి టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను మంగళవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ప్రజల్లోకి వెళ్లేలా చూడాలని మంత్రి సూచించినట్లు తెలిపారు. కామారెడ్డి అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇవ్వాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, మాజీ కౌన్సిలర్‌లు చాట్ల వంశీ, శివకృష్ణమూర్తి, జూలురి సుధాకర్, శ్రీనివాస్, సలీం, సాయిబాబాలు పాల్గొన్నారు.

అర్హులైనా ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు

- గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి

భిక్కనూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని గ్రంథాల సంస్థ జిల్లా చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం భిక్కనూరు మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైనా లబ్ధిదారులకు ఆయన మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామగ్రామాన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా కొనసాగుతున్నాయని అన్నారు. రాష్ట్రంలోని ఇల్లు లేని నిరుపేదలందరికి ఇల్లు అందజేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, ఈవో మహేష్‌గౌడ్, విండో చైర్మన్ భూమయ్య, నాయకులు లింబాద్రి, నర్సింహారెడ్డి, మహిపాల్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, సుదర్శన్, స్వామి, చలపతి పాల్గొన్నారు.



భిక్కనూరులో ఇంటి మంజూరు పత్రం అందజేస్తున్న దృశ్యం

పిట్లం విద్యుత్ శాఖలో వెక్కిరిస్తున్న ఖాళీలు

- మూడు మండలాల్లో ఏఈలు లేరు
- డివిజన్ పరిధిలో డీఈ ఇన్‌చార్జే
- సమస్యలతో ఇబ్బందుల పడుతున్న వినియోగదారులు
- సిబ్బందిని నియమించాలని గ్రామస్థుల ధర్నా

7



కమిటీ నిర్ణయం మేరకు ఫీజులు వసూలు చేయాలి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కామారెడ్డి టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీపై మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి జిల్లా విద్యాశాఖాధికారి రాజు స్పందించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారులు జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించాలని సూచించారు. ఎలాంటి నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాలు, బ్యాగ్స్ టై, బెల్ట్‌లు స్కూల్ పరిధిలో అమ్మరాదని, అధిక ఫీజులు వసూలు చేయరాదని తెలియజేయాలని ఆదేశించారు. పేరెంట్స్ టీచర్స్ కమిటీ నిర్ణయం మేరకు మాత్రమే ఫీజులు వసూళ్లు చేసేలా చూడాలని సూచించారు. ప్రతీ మండల విద్యాశాఖాధికారి ప్రైవేట్ స్కూళ్లను సందర్శించి తగిన రిపోర్టును అందించాలని తెలిపారు.

నాలుగు రోజుల్లో రైతుల ఖాతాల్లో జొన్నల డబ్బులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

లింగంపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): లింగంపేట మండలంలో జొన్నలు విక్రయించిన రైతులకు మూడు, నాలుగు రోజుల్లో డబ్బులు చెల్లించడం జరుగుతుందని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ మహేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. 'ఆంధ్రజ్యోతి' పత్రికలో ఆదివారం ప్రచురితమైన 'జొన్నల డబ్బుల కోసం రైతుల ఎదురుచూపులు' అన్న శీర్షికపై అధికారులు స్పందించారు. 24 కొనుగోలు కేంద్రాల్లో మే 31 వరకు 12,649 మంది రైతుల నుంచి 32,625 మెట్రిక్ టన్నుల జొన్నలను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేశామని వచ్చే రెండు, మూడు రోజుల్లో నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులను జమ చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.



కొత్త లోగోను ఆవిష్కరిస్తున్న ఎస్పీ, అధికారులు

కామారెడ్డి పోలీసు శాఖ కొత్త లోగో ఆవిష్కరణ

కామారెడ్డి టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఎస్పీ రాజేష్‌చంద్ర, ఇతర పోలీసు అధికారులు నూతన లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోగో కేవలం గుర్తింపు కోసం మాత్రమే కాదని పోలీసుశాఖ నిబద్ధత, ప్రజల పట్ల బాధ్యత, భావం, న్యాయబద్ధమైన విధానాలను ప్రతిబింబిస్తుందని తెలిపారు. పోలీసింగ్‌ను ప్రజలకు మరింత సమీపంగా, పారదర్శకంగా తీర్చిదిద్దేందుకు మేము నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. పారదర్శకతే మా బలం, ధైర్యమే మా ఆయుధమనే లక్ష్యంతో పోలీసులు వ్యవహరించాల్సిన దిశగా మార్గదర్శకాలు రూపొందించామని తెలిపారు. ప్రజల భద్రత కోసం ప్రతీ అధికారి శ్రద్ధగా, సమర్థవంతంగా పని చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు నరసింహారెడ్డి, చైతన్యరెడ్డి, జిల్లా పరిధిలోని సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి



అసదుద్దీన్ ఓవైసీని కలిసిన బోధన్ ఎంఐఎం అధ్యక్షుడు

బోధన్‌రూరల్,జూన్17(ఆంధ్రజ్యోతి): వచ్చే మున్సిపల్ ఎన్నికలలో బోధన్‌లో అత్యధిక స్థానాలను ఎంఐఎం అభ్యర్థులను గెలిచేలా కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. మంగళవారం బోధన్ ఎంఐఎం పార్టీ అధ్యక్షులు మీర్ ఇలియాస్ అలీ మర్యాద పూర్వకంగా హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా బోధన్‌లో రాజకీయ అంశాలపై చర్చించినట్లు బోధన్ పట్టణ అధ్యక్షులు మీర్ ఇలియాజ్ అలీ పేర్కొన్నారు. బోధన్‌లో మున్సిపల్ సీటును కైవసం చేసుకునేలా పార్టీ అభ్యర్థులను నిలబెట్టి చైర్మన్ సీటు కైవసం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. మైనారిటీల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలన్నారు. బోధన్‌లో మున్సిపల్ సీటు కైవసం చేసుకునేలా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు పట్టణ అధ్యక్షులు పేర్కొన్నారు. ఆయన వెంట మలక్‌పేట ఎంఐఎం ఎమ్మెల్యే హైమద్ బిన్ అబ్దుల్లా బలాలతో ఎంఐఎం నాయకులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షరాభ్యాసం



వల్లభాపూర్‌లో పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

కోటగిరి,జూన్17(ఆంధ్రజ్యోతి): కోటగిరి, పోతంగల్ మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మమాట, అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాలలో ర్యాలీలు నిర్వహించి చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించారు. అక్షరాభ్యాసంతో పాటు చిన్నారుల బరువు, ఎత్తు పరిశీలించారు. అనంతరం చిన్నారులకు పౌష్టికాహారం అందించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోపిలక్ష్మి, కోఆర్డినేటర్ స్వప్న, అంగన్‌వాడీ కార్యకర్తలు బాలలక్ష్మి, స్వరూప, సుజాత తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ప్యానెల్‌లో బోర్డులను ఎత్తుకెళ్లిన దొంగలు

బోధన్‌రూరల్,జూన్17(ఆంధ్రజ్యోతి): సాలూర మండల కేంద్రంలోని ఎత్తిపోతల లిఫ్ట్ ప్యానెల్ బోర్డులను దొంగలు ఎత్తుకెళ్లారని, 15రోజులు గడిచిన ఇప్పటి వరకు దొంగలను పట్టుకోలేకపోయారని సాలూర రైతులు పేర్కొన్నారు. ఈ ఎత్తిపోతల పథకంతో సుమారు 1600ఎకరాలకు సాగునీరు అందుతుందని ప్రస్తుతం నీరు అందక రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని లిఫ్ట్ ప్యానెల్ బోర్డును పరిశీలించాలని గ్రామ రైతులు కోరుతున్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన



హంగర్గఫారంలో ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

కోటగిరి,జూన్17(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని హంగర్గ ఫారం, సోంపూర్, కల్లూర్ గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని మంగళవారం ఎంపీడీవో చందర్ పరిశీలించారు. నిబంధన మేరకు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలన్నారు. వివిధ దశలను బట్టి బిల్లులు మంజూరు చేస్తామన్నారు. అనంతరం ఆయా గ్రామాలలో నర్సరీలను పరిశీలించారు. హరితహారంలో భాగంగా మొక్కలను సిద్ధం చేసి ఉంచాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట కార్యదర్శులు తదితరులున్నారు.

మత్తు పదార్థాల నిర్మూలనకు సహకరించాలి



కొత్తపల్లిలో మత్తుపదార్థాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై

కోటగిరి,జూన్17(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోటగిరి ఎస్ఐ సునీల్ పేర్కొన్నారు. కోటగిరి మండలంలోని కొత్తపల్లి గ్రామంలో మంగళవారం మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. మాదక ద్రవ్యాల రవాణాపై ప్రత్యేకనిఘా పెట్టామని, ఎవరైనావాడినా, విక్రయించిన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పేర్కొన్నారు.మత్తు పదార్థాలు రవాణా జరిగితే తమకు సమాచారం అందించాలని వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేస్తే ఓటీపీలు చెప్పవద్దని సూచించారు. త్రిబుల్ రైడింగ్ చేయవద్దని, బైక్ నడిపితే తప్పనిసరి హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలుశిక్ష

నవీపేట,జూన్17(ఆంధ్రజ్యోతి): నవీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ న్యాయాధికారి నూర్జహాన్ బేగం ముగ్గురికి జైలుశిక్ష విధించారని ఎస్సైవినయ్ తెలిపారు. మండలంలోని పోతంగల్‌కు చెందిన ఈర్నాల రాజు, నవీపేటకు చెందిన ఖురేషి చాంద్‌పాషాలకు నాలుగు రోజులు, నవీపేటకు చెందిన డి.గోపికి రెండు రోజుల జైలుశిక్షను మేజిస్ట్రేట్ విధించడం జరిగిందని ఎస్సైపేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని ఎస్సై తెలిపారు.

వీడీసీ ఆగడాలను అరికడతాం

జక్రాన్‌పల్లి జూన్17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విడిసి ఆగడాలను అరికడతామని శ్రీధర్‌బట్టు అన్నారు. మంగళవారం ఎస్సీ, ఎస్టీ చైర్మన్ బక్కి వెంక టయ్యకు ఫిర్యాదు చేసినట్లు శ్రీధర్‌బట్టు తెలిపారు. జిల్లాలోని విడిసిల పేరుతో ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో కుల వృత్తులపై, ఇతర బలహీన వర్గాలపై దాడులు, బహిష్కరణలు చేస్తున్నార న్నారు. వచ్చేనెల జూలై మొదటివారం నిజామాబాద్ జిల్లాలో విడిసిల ఆగడాలపై సమీక్ష సమావేశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమీషన్ జిల్లా సభ్యుడు శంకర్, శ్రీధర్‌బట్టు, రాకేష్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలి

● జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్



రెవెన్యూ సదస్సులో అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం



సిర్పూర్‌లో రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు చేసుకుంటున్న రైతులు

బోధన్‌రూరల్,జూన్17(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిష్కారం అయ్యేలా చూడాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని చావిడి వద్ద రెవెన్యూ స దస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయో తహసీల్దార్ విఠల్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపి రైతులను భూ సమస్యల నుంచి విముక్తి కల్పించాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టిందన్నారు. గ్రామాలలో, పట్టణాలలో సైతం రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ నెల 18వ తేది వరకు పట్టణ, గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. భూసమస్యలు ఉన్న రైతులు తమ సమస్యలను అధికారులకు విన్నవించాలన్నారు. వచ్చే దరఖాస్తులను పరిశీలించి రైతులసమస్యలు పరిష్కారం అయ్యేలా చూడాలని తహసీల్దార్ విఠల్‌కు సూచించారు. ఆయన వెంటశివాలయం కమిటీ చైర్మన్ హరికాంత్ చారి, మాజీ కౌన్సిలర్ శరత్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది అన్నారు.

డొంకేశ్వర్: రెవెన్యూ సదస్సులతో భూసమస్యలు పరిష్కా రమైతాయని తహసీల్దార్‌నరేష్‌అన్నారు. డొంకేశ్వర్ మండలం సిర్పూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో భూభారతి రెవెన్యూసదస్సును నిర్వహిం చారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. భూసమస్యలు ఉన్న రైతులు నేరుగా సమస్యలు పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకో వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అశోక్ సింగ్‌రైతులు ప్రదీప్ రెడ్డి, నర్సయ్యకండలపెద్దరాజన్న, ఆనందం పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి:మండలంలోని సికింద్రపూర్ గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూసమస్యల పరిష్కారం కోసం ఈ సదస్సులో రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ సదస్సులో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కారించాలని భూబాధిత రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్మయి, ఆర్ ప్రవీన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కూతుళ్లను లైంగికంగా వేధించడంతోనే తండ్రి హత్య : సీఐ



వివరాలను వెల్లడిస్తున్న నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్

నవీపేట,జూన్17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారంకు చెందిన పల్లపు నర్సయ్య(54) తన ఇద్దరు కూతుళ్లను లైంగికంగా వేధించడంతోనే హత్యకు గురయ్యాడని నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం నిజామాబాద్‌లోని తన కార్యాలయంలో సీఐ వివరాలు వెల్లడించారు. మృతుడు పల్లపు నర్సయ్యకు భార్య నర్సమ్మతో పాటు గంగామణి, వర్షిత అనే ఇద్దరు కూతుళ్లు ఉన్నారని, పెద్ద కూతురు గంగామణి భర్త పది సంవత్సరాల క్రితం మృతి చెందడంతో తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆమె ధర్మారంలోని తన పుట్టింట్లోనే ఉంటుందని అన్నారు. చిన్న కూతురు మక్కల వర్షితను నిజామాబాద్ రూరల్ మండలం కొత్తపేటకు చెందిన శేఖర్‌కు ఇచ్చి వివాహం జరిపించగా ప్రస్తుతం వారు నిజామాబాద్‌లో నివసిస్తున్నారని అన్నారు. మృతుడు పల్లపు నర్సయ్య ఇటీవల తనకు భార్య, పిల్లలు ఉన్నప్పటికీ రెండో వివాహం చేసుకున్నాడని అన్నారు. ఇంట్లో ఉన్న పెద్ద కూతురు గంంగామణిని లైంగికంగా వేధించడంతో తల్లి నర్సమ్మతో కలిసి గంగామణి గత కొన్ని రోజులుగా నిజామాబాద్‌లో అద్దె గదిలో నివాసం ఉంటున్నారని ఆయన పేర్కొన్నారు. సోమవారం చిన్న కూతురు మక్కల వర్షిత ధర్మారంలోని తన పుట్టింటికి రాగా మద్యం మత్తులో ఆమెతో అసభ్యకరంగా వ్యవహరించడంతో పాటు లైంగికంగా వేధించాడని దీంతో పక్కనే ఉన్న రోకలి దుడ్డుతో తండ్రి తలపై బాధగా అతడు అక్కడికక్కడే మృతి చెందాడని సీఐ పేర్కొన్నారు. నిందితురాలు మక్కల వర్షితను అరెస్టు చేసి కోర్టుకు తరలించడం జరిగిందని సీఐ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వినయ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే సహకార సంఘ లక్ష్యం



ఎడపల్లిలో మాట్లాడుతున్న సహకార సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి

ఎడపల్లి, జూన్17(ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సు కొరకు నిత్యం పాటు పడతామని, రైతులకు ఎట్టి పరిస్థితులలో నష్టం వాటిల్లకుండా చూస్తామని ఎడపల్లి మండల ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి అన్నారు. మంగళవారం ఎడపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొందరు బీజేపీ పార్టీ నాయకులు రైతులతో రాజకీయం చేస్తూ తమ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారన్నారు. యూరియాకు లింకు పెట్టి రైతులను ఇబ్బందులు పెడుతున్నారని ఇష్టారీతిన తమకు తోచిన విధంగా మాట్లాడుతున్నారని, నిజా నిజాలు తెలుసుకుని మాట్లాడాలీ కాని సహకార సంఘంపై రైతులకు చెడు అభిప్రాయం తెచ్చేవిధంగా చేయడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం రసాయన ఎరువుల వాడకం తగ్గించాలనే ఉద్దేశ్యంతో అనుకున్న మేర యూరియా సరఫరా చేయడం లేదని ఇలాంటి సమయాల్లో రైతులకు ఎట్టి పరిస్థితులలో యూరియా కొరత రాకుండా చూడాలనే ఉద్దేశ్యంతో, రైతులు యూరియా కోసం ఇబ్బం దులు పడవద్దనే భావనతో ఎక్కడ అందుబాటులో యూరియా ఉంటే అక్కడి నుంచి తెప్పించడం జరిగిందని, వారు యూరియాకు లింకు పెట్టడంతోనే అది తప్పని పరిస్థితులలో రైతులకు ఇవ్వడం జరిగిందన్నారు. కొన్ని చోట్ల యూరియా కొరతతో రైతులు ఇబ్బ ందులు పడుతు న్నారని అలాంటిది ఎడపల్లి సహకార సంఘం ఆద్వర్యంలో నిర్వహిస్తున్న అన్ని యూరియా అమ్మకపు కేంద్రాలలో కొరత లేకుండా చూస్తున్నామ న్నారు. రైతులను ఇబ్బందులు పెట్టాలనే కొందరు ఎడపల్లి సహకార సంఘంపై బురద జల్లుతూ రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఎడపల్లి సహకార సంఘం ఎల్లప్పుడూ రైతుల అభివృద్ధి కొరకు పాటుపడుతుందని కలలో కూడా రైతులకు నష్ట వాటిల్ల కుండా చూస్తుందని గ్రహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన తోపాటు సహకార సంఘం కార్యదర్శి రాజారాం తదితరులు ఉన్నారు.

రాంపూర్‌లో 'ప్రజల వద్దకే పోలీసు'



రాంపూర్‌లో పర్యటిస్తున్న ఎస్సై వినయ్

నవీపేట,జూన్17(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్‌లో మంగళవారం ప్రజల వద్దకే పోలీసు కార్యక్రమం నిర్వహించారు. నిజామాబాద్ సీపీ సాయి చైతన్య ఆదేశం మేరకు పోలీసు డ్యూటీలో భాగంగా గ్రామంలో రోల్ కాల్ నిర్వహించి గ్రామస్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎవరికైన ఆపద వస్తే పోలీసు స్టేషన్‌కు నిర్భయంగా వచ్చి తమ సమస్యలపై ఫిర్యాదు చేయాలని ఎస్సై వినయ్ కోరారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ కుమార్, రమేష్, మోహన్ తదితరులున్నారు.

నకిలి విత్తనాలు అమ్మిన వారిపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘ నాయకులు

జక్రాన్‌పల్లి జూన్17 (ఆంధ్రజ్యోతి): నకిలి విత్తనాలు అమ్మిన వారిపై చర్యలు తీసు కోవాలని కోరుతూ మంగళవారం జక్రాన్‌పల్లి తహసీల్దార్ కార్యాలయంలో అఖిల భారత రైతు ఐక్యసంఘం నాయకులు తహసీల్దార్ అధికారులకు వినతి పత్రం అంద జేశారు. నకిలి విత్తనాలతో పాటు నకిలి ఎరువులు అమ్మేవారిపై చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు ఐక్యసంఘం ఆర్మూర్ ఏరియా ప్రధా న కార్యదర్శి యు. రాజన్న, ఉపాధ్యక్షుడు టి గంగాధర్, సాయిలు, రాజారాం, కిషన్, డి. గంగాధర్, మోహన్, ఏ. సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను అడ్డుకోవాలి

బోధన్‌రూరల్,జూన్17(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ శ్రీరాంనగర్ కాలనీలో ఫ్యాక్టరీ భూముల్లో కొందరు అక్రమంగా ఇందిరమ్మ ఇళ్లను కడుతున్నారని వారిని అడ్డుకోవాలని ఎంసీపీఐ పార్టీ పట్టణ కార్యదర్శి ఎండీ మోసిన్ మంగళవారం ఫ్యాక్టరీ కోర్ కమిటీ అధికారి విశ్వనాథ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను నిరుపేదలకు ఇస్తుండగా కొందరు అక్రమ నిర్మాణాలు చేపట్టి ఇందిరమ్మ లోన్లు తీసుకుంటున్నారని ఆరోపిస్తూ ఫ్యాక్టరీ అధికారి విశ్వనాథంకు వినతిపత్రం అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఉషా, శోభ, సమ్రిన్ బేగం, సంతోష్, నర్సమ్మ, గాంధారి బాయి, పూజమ్మ తదితరులున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



'స్కావెంజర్‌లతో మాట్లాడుతున్న ఎంఈవో ఆనంద్ రావు

ఏర్గట్ల,జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని మండల విద్యాధికారి ఆనందర్ రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో శానిటేషన్‌పై స్కావెంజర్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా తడపాకల్ హైస్కూల్ సోషల్ ఉపాధ్యాయులు భూపతి స్కావెంజర్‌లకు శిక్షణను అందించారు. ఈ కార్యక్రమంలో మండంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కావెంజర్‌లు పాల్గొన్నారు.

బాల్కొండ: ప్రభుత్వ పాఠశాలలను పరిశు భ్రంగా ఉంచడంలో స్కావెంజర్లు ముందుండాలని బాల్కొండ ఎంఈవో బట్టు రాజేశ్వర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాలలో స్కావెంజర్లకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. పాఠశా లలో పరిశుభ్రత పాటించాలని టాయి లెట్ శుభ్రంగా ఉంచడంతో పాటు మొక్కలను పెంచే బాధ్యత కూడా స్కావెంజర్లదే అన్నారు. ప్రతీ పాఠశా లలో కిచెన్‌గార్డ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల పరిశుభ్రత కోసం ప్రభుత్వం బ్రెష్‌లు, టాయిలెట్ క్లీనర్లు, చీపుర్లు ఇతర సామగ్రిని అందజేస్తుందన్నారు. ఈ సమావేశంలో ఇంచార్జి హెచ్‌ఎం ప్రశాంత్ కుమార్, శంకర్, ప్రభాకర్, సుమలత, తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్ కాలువ స్థలంలో ఆక్రమణల తొలగింపు

● ఎకరం 38 గుంటల భూమి స్వాధీనం



ఆక్రమ నిర్మాణాలు కూల్చివేస్తున్న అధికారులు

ఆర్మూర్ టౌన్, జూన్17 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ శివారులో నిజాంసాగర్ డిస్ట్రిబ్యూషన్ కాలువ స్థలంలో ఆక్రమణలను రెవెన్యూ మున్సిపల్ ఇరిగేషన్ అధికారులు మంగళవారం తొలగించారు. కొన్ని నెలల క్రితం ప్రభుత్వ భూమిని ఒక రియాల్టర్ కబ్జా చేసి ఆక్రమ షెడ్లు నిర్మించారు. ఇటీవల పలువురు ప్రభుత్వ స్థలం కబ్జాపై అధికారులకు ఫిర్యాదు చేయడంతో అట్టి స్థలాన్ని అధికారులు సర్వే జరిపి కెనాల్ భూమికి హద్దులు ఏర్పాటు చేసి ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇట్టి భూమిలో చేపట్టిన ఆక్రమ నిర్మాణాలను జేసీబీ సహాయంతో తొలగించారు. ఆక్రమ నిర్మాణాలను కూల్చివేసిన అనంతరం ప్రభుత్వ స్థలాన్ని కాపాడేందుకు కంచె ఏర్పాటు చేయిస్తామని ఇరిగేషన్ డీఈ కృష్ణమూర్తి, ఆర్మూర్ తహసీల్దార్ సత్యనారాయణ, మున్సిపల్ కమీషనర్ రాజు తెలిపారు. ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూమిని ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని పలువురు అన్నారు.

జక్రాన్‌పల్లి పేటచెరువు మరమ్మతులు చేయించాలి



ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేస్తున్న జక్రాన్‌పల్లి కాంగ్రెస్ నాయకులు

జక్రాన్‌పల్లి జూన్17 (ఆంధ్రజ్యోతి): జక్రాన్‌పల్లిలోని పేట చెరువు మరమ్మతు పనులను చేయించాలని కోరుతూ మంగళవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని జక్రాన్‌పల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసారు.పేటచెరువుకు నిధుల మంజూరు చేయించి అలుగు, కట్ట మరమ్మతులు, తూము మరమ్మతు పనులు చేయించాని ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో అర్గుల్ సింగిల్ విండో చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి, జక్రాన్‌పల్లి గ్రామస్థులు ఉన్నారు.

తపాలాశాఖ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న తపాలశాఖ అధికారి

భీమ్‌గల్, జూన్17 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం తపాలశాఖ ద్వారా ప్రవేశపెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూపర్ వైజర్ దాసరి చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని సర్వసమాజ్ కమిటి భవనంలో తపాలశాఖ ఆధ్వర్యంలో పథకాలపై అవగాహన కల్పించారు. తపాలశాఖ ప్రతీవ్యక్తికి డబ్బు పొదుపుతో పాటు ఆర్థికంగా స్థిరపడేందుకు అందిస్తున్న పథకాలైన ఎస్‌బి, ఆర్డీ, ఎస్ఎస్‌ఏ, పీఎఫ్, ఎంఐఎస్, ఎస్‌పీఎస్ఎస్ తదితర పథకాలపై అవగాహన కల్పించారు. ప్రజలు తపాలశాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. చిన్న మొత్తాల పొదుపు ఖాతా మొదలుకొని పోస్టల్ బీమా, ఇతర పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో సర్వసమాజ్‌కమిటీ అధ్యక్షుడురవి, ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం జాన్‌వెల్సన్,ఈశ్వర్,జలజ, సబ్‌పోస్టుమాస్టర్, ప్రజలు పాల్గొన్నారు.

యోగ శారీరక దృఢత్వానికి, ఆరోగ్యానికి రక్షణ



గోవూర్‌లో యోగాసనాలు చేస్తున్న విద్యార్థులు

మోస్రా,జూన్17(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గోవూర్‌లో యోగ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆసనాలు, ప్రాణాయామం చేసి చూపిస్తూ వారితో చేయించారు. అదే విధంగా ఆరోగ్య నియమాలు, యోగ వల్ల శరీరం దృఢంగా ఉంటుందని రోజువారి కార్యక్రమాలలో భాగంగా ఒక గంట సమయం కేటాయించి యోగ చేయాలని యోగ వలన ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగ శిక్షకులు ప్రవీణ్ కుమార్, వీణ, మండల విద్యాభివృద్ధి శాఖ అధికారి నాగనాథ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజన్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



పడిగెల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మెడికల్ ఆఫీసర్ మీనా

వేల్పూర్, జూన్17 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల మెడికల్ ఆఫీసర్ మీనా సూచించారు. మండలంలోని పడిగెల గ్రామంలోని గ్రామ పంచాయితీ కార్యాలయంలో సీజనల్ వ్యాధుల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మీనా మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తమ ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, తీసుకునే ఆహారం పట్ల జాగ్రత్త వహించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆరోగ్య కార్యకర్తలు రవళి, స్వరూప, జీపీ సెక్రటరీ సజన్‌కుమార్, సహాయకార్యదర్శి కిరణ్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరోజిని, ఆశవర్కర్లు, గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు.

దుబాయిలో గల్లంతైన చేపూర్‌వాసి

ఆచూకీ తెలుసుకోవాలని వినతి



తెలంగాణ గల్ఫ్ఎన్ఆర్ఐ వైస్ చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఆర్మూర్ రూరల్, జూన్17 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామానికి చెందిన బట్టు నాగార్జున ఇటీవల దుబాయిలో గల్లంతయ్యారు. ఆయన ఆచూకి లభించక కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. బట్టు నాగార్జున ఆచూకి తెలుసుకుని స్వదేశానికి రప్పించాలని కోరుతూ పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు, కాంగ్రెస్ నాయకుడు వినయ్‌రెడ్డి, మారచంద్రమోహన్ ఎన్నా చిన్నారెడ్డిలు విన్నవించారు. స్పందించిన మహేష్ కుమార్‌గౌడ్, ప్రవాసి గల్ఫ్ ప్రజావాణిలో తెలంగాణ గల్ఫ్ ఎన్ఆర్ఐ వైస్ చైర్మన్ భీమ్‌రెడ్డికి విషయాన్ని వివరించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు ప్రజాదర్బర్‌కు వెళల్లి గల్ఫ్‌ప్రజావాణిలో దుబాయిలో గల్లంతైన చేపూర్ వాసి బట్టు నాగార్జున విషయమై వినతి పత్రం అందజేశారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఆర్మూర్ నాయకులు

ఆర్మూర్‌రూరల్, జూన్17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌ను మంగళవారం ఆర్మూర్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసారు. హైదరాబాద్‌లోని ఆయన నివా సంలో ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జివినయ్‌రెడ్డి, జిల్లా గ్రంథా లయ సంస్థ మాజీ చైర్మన్ మార చంద్రమోహన్ కలిసి సన్మానించారు. వారి వెంట మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి,శ్రీకాంత్,శ్రీనివాస్ ఉన్నారు.

రికార్డు గ్రహీత వినోద్‌రెడ్డిని సన్మానించిన మధుయాష్కిగౌడ్



వినోద్‌రెడ్డిని సన్మానిస్తున్న మాజీ ఎంపీ

ఆర్మూర్ రూరల్, జూన్17 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం అంకా పూర్‌కు చెందిన వండర్ బుక్ ఆఫ్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు సాధించిన వినయ్‌రెడ్డిని టీపీసీసీ ప్రచార కమిటి చైర్మన్ మధుయాష్కిగౌడ్ మంగళవారం సన్మానించారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో రికార్డు సాధించిన వినోద్‌రెడ్డిని అభినందించి సన్మానిం చారు.



రైల్వే జీఎంకు అందజేసిన వినతి పత్రాన్ని చూపుతున్న నాయకులు

డిచ్‌పల్లిలో ఎక్స్‌ప్రెస్ రైళ్లని నిలపాలి

● రైల్వే జీఎంకు పీడీఎస్‌యూ నాయకుల వినతి

డిచ్‌పల్లి, జూన్17(ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి రైల్వే స్టేషన్‌లో ఎక్స్ ప్రెస్ రైళ్లను నిలపాలని, అదేవిధంగా పుట్ ఓవర్‌బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ సౌత్ సెంట్రల్ రైల్వే జీఎంకు పీడీఎస్‌యూ నాయకులు వినతిపత్రం అందజేసినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిచ్‌పల్లిలో తెలంగాణ యూనివర్సిటీ, బెటాలియన్, సీఎంపీ మెడికల్ కళాశాల ఉన్నాయని, ఎంతో మంది విద్యార్థులు చదువు కోసం ఇక్కడికి వస్తున్నరని, ఎక్స్‌ప్రెస్ రైళ్లను డిచ్‌పల్లిలో నిలిపితే సౌకర్యంగా ఉంటుందని కోరారు. రైల్వేస్టేషన్ పక్కనే ప్రభుత్వడిగ్రీ, జూనియర్ కళాశాలలు ఉన్నాయని విద్యార్థులు రోడ్డుపైకి రావలంటే రైలుపట్టాలు దాటాల్సి వస్తుందని పుట్‌ఓవర్‌బ్రిడ్జి నిర్మించాలని కోరారు. నిజామాబాద్-సికింద్రాబాద్ మధ్య డబుల్‌లైన్ నిర్మించాలని కోరారు. ఇందులో సాయికిరణ్, వంశీ,రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావద్దు



గ్రామస్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మోపాల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని ఎస్సై యాదగిరి గౌడ్ యువతకు సూచించారు. మంగళవారం మోపాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని న్యాల్‌కల్ గ్రామంలో మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై యాదగిరి గౌడ్ మాట్లాడుతూ మత్తు పదార్థాల నిర్మూలన, సైబర్ క్రైం నేరాలను అరికట్టేందుకు అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రజలను ఆసరగా చేసుకొని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని వాటి బారిన పడకుండా జాగ్రత్త పడాలని అన్నారు. యువత గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. వీటి అవగాహనపై ప్రభుత్వం గ్రామాల వారిగా సదస్సులను ఏర్పాటుచేసి యువత, ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు, గ్రామ కార్యదర్శి మల్లేష్, గ్రామ పంచాయతీ సిబ్బంది, మహిళా సంఘాలు, ఐకేపీ సిబ్బంది, యువకులు ఉన్నారు.

సాగుకాలం.. విత్తన శుద్ధి అవసరం

● విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ, అధిక దిగుబడులు ● విత్తన శుద్ధి తప్పనిసరి పాటించాలంటున్న కేవీకే శాస్త్రవేత్తలు



వేళ్లలో వచ్చే తెగుళ్లు

రుద్రూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పంటల సాగు కోసం విత్తన శుద్ధి అత్యంత ముఖ్యమైనది. విత్తనాలను శిలీంధ్ర నాశినులు, పురుగు మందులు, జీవ సంబంధిత ఉత్పత్తులతో శుద్ధి చేయడంతో మొలకలు ప్రారంభ దశలో మట్టి ద్వారా వ్యాపించే తెగుళ్ల నుంచి రక్షణ పొందుతాయి. విత్తన శుద్ధి చేసిన విత్తనాలతో మొలకలు సమానంగా వస్తాయి. వ్యాధుల ప్రభావం తక్కువగా ఉండడంతో పాటు పంటల మొదటి దశలో స్ప్రే అవసరం తగ్గుతుంది. పంట ఆరోగ్యంగా పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో రైతులు వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విత్తన శుద్ధి అనంతరం పంటల సాగు చేస్తే చీడపీడల నుంచి రక్షణ పొందడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని రుద్రూరు చెరకు, వరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. పలు రకాల పంటలో విత్తన శుద్ధి ఎలా పాటించాలో శాస్త్రవేత్తలు వివరించారు.

● వరి పంటలో..

వరి నారుమడులను సిద్ధం చేసుకునే రైతులు ముందుగా విత్తన శుద్ధిపై శ్రద్ధ వహించాలి. మెట్ట నారుమడులకు అయితే కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బండజిమ్‌ను తడితో పట్టించి ఆరబెట్టి నారుమడిలో చల్లుకోవాలి. దమ్ముచేసిన నారుమడులకైతే లీటరు నీటికి 1 గ్రాము కార్బండజిమ్ కలిపిన ద్రావణంలో 24గంటలు నానబెట్టి తర్వాత మండే కట్టిన మొలకలను నారుమడిలో చల్లుకోవాలి. కిలో విత్తనాలు నానబెట్టడానికి లీటరు రసాయనం కలిపిన నీరు సరిపోతుంది. ఈ విధంగా శిలీంధ్రనాశినితో విత్తన శుద్ధి చేయడం వల్ల మొక్కకు తొలి దశలో ఆశించే అగ్గి తెగుళ్లు, ఆకు మచ్చ తెగుళ్లను నివారించవచ్చు. అదే విధంగా వరినాట్లు వేసే ముందు నారు కట్టలను, క్లోరిఫైరిఫాస్ 50శాతం ఇసి 1.6మి.లీటర్లను లీటరు నీటికి కలిపిన ద్రావణంలో 12గంటలు ఉంచినట్లయితే తొలి 30రోజుల వరకు వరిపంటను ఆశించే కాండం తొలిచే పురుగు, తాటాకు తెగులు, పచ్చదోమలను నివారించవచ్చు.

● మొక్కజొన్నలో..

పంటలో కాండం కుళ్లు, ఆకు మాడు తెగులు, మసికుళ్లు అధికంగా ఆశించే ప్రాంతాలలో మాంకోజెట్ 3 గ్రాములు ఒక కిలో విత్తనానికి కలిపి శుద్ధి చేసుకోవాలి. అదేవిధంగా కత్తెర పురుగు, గులాబీ రంగు కాండం తొలుచు పురుగు నివారణకు థయోమిథాక్సామ్+సయంట్రనిలిప్రోల్ 4 మిల్లీ లీటరు ఒక కిలో విత్తనానికి కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి.

● కందిపంటలో..

కందిలో విత్తనం ద్వారా సంక్రమించే ఎండు తెగులును నివారించడానికి తెగులును తట్టుకునే రకాలను సాగు చేయడంతో పాటు 10 గ్రాముల ట్రైకోడెర్మా విరిడేతో కిలో విత్తనానికి కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి. దాని తర్వాత ఎకరాకు సరిపోయే విత్తనానికి 200 గ్రాముల రైజోబియం కల్చర్‌తో విత్తన శుద్ధి చేసుకోవాలి.

● పెసర, మినుము పంటల్లో..

పెసర, మినుము కిలో విత్తనానికి 2.5 గ్రాముల మ్యాంకోజెట్‌తో విత్తన శుద్ధి చేయడం వలన ఆకుమాడు తెగుళ్ల నుండి పంటను కాపాడవచ్చు. పైరు తొలి దశలో ఆశించే రసం పీల్చు పురుగుల నుండి పంట రక్షణ కోసం కిలో విత్తనానికి 5మి.లీ ఇమిడాక్లోప్రిడ్, మోనోక్రోటోఫాస్‌తో విత్తన శుద్ధి చేయాలి. అపరాలు అయినటువంటి కంది, పెసర, మినుము వంటి పంటలలో ప్రత్యేకంగా నిర్దేశించబడిన రైజోబియం కల్చర్‌ను 200 గ్రాములు ఎకరాకు సరిపోయే విత్తనానికి పట్టించాలి. దీని వలన నత్రజని స్థిరీకరణ పెరిగి అధిక దిగుబడి సాధించే అవకాశం ఉంటుంది.

● సోయా చిక్కుడులో..

సోయాచిక్కుడు పంట తొలి దశలో ఆశించే మొవ్వు కుళ్లు తెగులు, ఆకు మచ్చ తెగుళ్ల నుండి సంరక్షించడానికి కిలో విత్తనానికి 1గ్రామ కార్బండజిమ్ లేదా 3గ్రాముల థైరామ్, కాప్టాన్‌తో విత్తన శుద్ధి చేయాలి. తర్వాత 1.5మి.లీ ఇమిడాక్లోప్రిడ్ 48శాతంతో విత్తన శుద్ధి చేయాలి. దీని వలన రసం పీల్చే తామర పురుగులు, కాండం తొలిచే ఈగ నుండి పంట రక్షించబడుతుంది. దాని తర్వాత ప్రతీ పది కిలోల విత్తనానికి 200గ్రాముల రైజోబియం కల్చర్‌ను తగినంత నీరు, జిగురును కలిపి విత్తనానికి పట్టించి, నీడలో ఆరబెట్టి అరగంట తర్వాత విత్తుకోవాలి. దీని వల్ల నత్రజని స్థిరీకరణ పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చు.

విత్తన శుద్ధితో అధిక దిగుబడులు



● సాయి చరణ్, కీటక శాస్త్రవేత్త

రైతులు సాగు చేసే పంటలలో తప్పనిసరిగా ముందుగా శిలింద్రనాశిని, కీటకనాశిని దాని తర్వాత జీవ సంబంధమైన రసాయనాలతో విత్తనశుద్ధి చేయాలి. సకాలంలో సస్యరక్షణ చర్యలను చేపట్టి అధిక దిగుబడులు సాధించవచ్చు.

తెలుసుకుందాం!!



వరి అగ్గి తెగుళ్లు, మొక్కజొన్న ఆకు ఎండు తెగుళ్లు

● ప్రొద్దు తిరుగుడు పంటలో..

పొద్దు తిరుగుడులో ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు ఆశించే ప్రాంతాల్లో రైతులు ఇప్రోడియాన్ 25 శాతం + కార్బండజిమ్ 25 శాతం మందును 2 గ్రాములు కిలో విత్తనానికి కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి. అదే విధంగా పంట తొలి దశలో ఆశించే తెల్లదోమ, పచ్చదోమ వంటి రసం పీల్చే పురుగుల నివారణకు కిలో విత్తనానికి 5.మి.లీ ఇమిడాక్లోప్రిడ్‌తో విత్తన శుద్ధి చేసుకోవాలి.

● వేరుశనగ పంటలో..

వేరుశనగలో ఆకుమచ్చ తెగులు, కాండం మొదలు కుళ్లు తెగులును పంట తొలి దశలో నివారించడం కోసం కిలో విత్తనానికి 3 గ్రాముల మ్యాంకోజెట్ లేదా 1గ్రాము కార్బండజిమ్‌తో విత్తన శుద్ధి చేసుకోవాలి. వేరు పురుగు ఆశించే ప్రాంతాల్లో కిలో విత్తనానికి 7మి.లీ క్లోరిఫైరిఫాస్ కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి.

● పసుపు పంటలో..

పసుపు పంటను దుంప వేరుకుళ్ల తెగులు, ఆకుమచ్చ తెగుళ్ల నుంచి కాపాడుకోవడానికి లీటరు నీటికి 3 గ్రాముల మ్యాంకోజెట్ లేదా 3 గ్రాముల మెటలాక్సిల్ కలిపిన ద్రావణంలో 40 నిమిషాల పాటు కొమ్ములను ఉంచి బయటకు తీసి నీడలో ఆరబెట్టాలి. పసుపు కొమ్ము/విత్తనాలకు పొలుసు పురుగు ఆశించి ఉన్నప్పుడు శీలింద్రనాశినితో పాటు లీటరు నీటికి 5మి.లీ మలాథియాన్, 2మి.లీ మోనోక్రోటోఫాస్ కూడా కలిపి తర్వాత నీడలో ఆరబెట్టి నీటిని మార్చి 5గ్రాముల ట్రైకోడెర్మా విరిడే కలిపిన ద్రావణంలో ముంచి కొమ్ములను నీటిలో ఆరబెట్టి విత్తుకోవాలి.

● చెరకు విత్తనం కోసం..

జూలైలో చెరకు నాటుకునే రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధిని చేసుకోవాలి. ముచ్చెలను వేడినీటిలో 520సెల్సియస్ ఉష్ణోగ్రత్త వద్ద 30నిమిషాలు లేదా తేమతో మిళితమైన వేడిగాలిలో 540సెల్సియస్ వద్ద 2గంటలు ఉంచి శుద్ధి చేయాలి. ఆకుమాడు, కాటుక తెగుళ్లను నివారించవచ్చు.



కుళ్లిన మామిడి పండ్లను పారేసేందుకు వచ్చిన వ్యాపారులు

కుళ్లిన మామిడి పండ్లను కాలనీలో వేయొద్దు

● పండ్లను పారేసేందుకు వచ్చిన వ్యాపారులను అడ్డుకున్న కాలనీ వాసులు

బోధన్ రూరల్, జూన్17(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని హనుమాన్ టెకిడి కాలనీ సమీపంలో వ్యాపారులు కుళ్లిన మామిడి పండ్లు పారేస్తున్నారని, దీంతో తమ కాలనీలో దుర్వాసన వస్తుందని కాలనీ వాసులు మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. కుళ్లిపోయిన మామిడిపండ్లను పారబోయడానికి వచ్చిన వ్యాపారిని అడ్డుకున్నారు. తమ కాలనీలో ఇళ్ల సమీపంలో కుళ్లిపోయిన పండ్లను వేయవద్దని పేర్కొన్నారు. తమ కాలనీలో దుర్వాసన వస్తుందని దీనివల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని కాలనీవాసులు పేర్కొన్నారు. వర్షాకాలంలో దోమలు, ఈగలతో ప్రజలు రోగాలకు గురయ్యే ఆస్కారం ఉందన్నారు. ఇక నుంచి వ్యాపారస్తులు తమ కాలనీ సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో ఎటువంటి వస్తువులు వేయవద్దని కాలనీవాసులు ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులున్నారు.

విద్యుత్‌శాఖలో వెక్కిరిస్తున్న ఖాళీలు

● డీఈ పరిధిలో సిబ్బంది కొరత ● మూడు మండలాల్లో ఏఈలు ఒక్కరూ లేరు
● డివిజన్ పరిధిలో డీఈ ఇన్‌చార్జే ● సిబ్బందిని నియమించాలని గ్రామస్థుల ధర్నా

పెద్దకొడప్‌గల్, జూన్18 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ వచ్చిందంటే చాలు రైతన్నలు వర్షాల కోసం ఎదురుచూస్తుంటారు. సరైన సమయంలో వానలు కురవకపోతే వ్యవసాయ బోరుబావులపై ఆధారపడతారు. అయితే బోరుబావులలో పంపుసెట్లు పని చేయాలంటే విద్యుత్ తప్పనిసరి. అందుకే రైతన్నలు వానలతోపాటు పంపు మోటార్లు నడిచేందుకు నాణ్యమైన విద్యుత్ కోసం ఆరాటపడుతుంటారు. అయితే అంతప్రాముఖ్యత ఉన్న పిట్లం విద్యుత్‌శాఖ డీఈ పరిధిలో ముఖ్యమైన పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. డివిజన్ డీఈతోపాటు, పిట్లం, పెద్దకొడప్‌గల్, నిజాంసాగర్ మండలాలకు సంబంధించిన ఏఈ, సబ్ ఇంజనీర్‌లు లేక పాలనకు ఇబ్బందిగా మారింది. గత కొన్నినెలల కింద జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా పిట్లం డీఈ, మూడు మండలాలకు చెందిన ఏఈలు బదిలీ అయ్యారు. నాటి నుంచి కొత్త వారెవరికీ ఇక్కడ పోస్టింగ్ రాకపోవడంతో కొన్ని నెలలుగా ఖాళీలుగా ఉన్నాయి. ప్రస్తుతం డివిజన్ డీఈగా కన్‌స్ట్రక్షన్ ఏఈ అరవింద్ బాధ్యతలు చూస్తుండగా, పిట్లం ఏఈగా మేనూర్ ఏఈ రమేష్ ఇన్‌చార్జి బాధ్యతలు, పెద్దకొడప్‌గల్ ఏఈగా బిచ్కుంద పవన్, నిజాంసాగర్ ఏఈగా జుక్కల్ ఏఈ మోహన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో పాటుగానే మూడు మండలాలకు చెందిన సబ్‌ఇంజనీర్లు లేక పక్కన ఉన్న మండలాల సబ్‌ఇంజనీర్లు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గతంలో జరిగిన బదిలీల్లో అధికారులు ఇక్కడ కొత్తగా వచ్చేవారిని నియమించకపోవడంతో వినియోగదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

వినియోగదారులకు తప్పని ఇబ్బందులు

సబ్‌స్టేషన్ల నుంచి ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా అవుతోంది. గ్రామాల్లో విద్యుత్ పరంగా ఏదైనా సమస్యలు తలెత్తుతే ఆ శాఖకు చెందిన వారే సమస్యను పరిష్కరించాలి. అయితే ఇదంతా జరగాలంటే గ్రామ స్థాయిలో జూనియర్ లైన్‌మెన్, అసిస్టెంట్ లైన్‌మెన్, లైన్‌మెన్‌ల పాత్ర చాలా కీలకం. వీరే లేకపోతే విద్యుత్ సమస్యలు పరిష్కారం కావాలంటే కష్టమే. దీంతో పాటుగానే వ్యవసాయ బోరుబావుల వద్ద మోటార్లు సమస్య వస్తే విద్యుత్ సరఫరా తీసివేసి మరమ్మత్తులు చేపట్టాలి. ఇలా జరగాలంటే గ్రామ స్థాయిలో ఉండే ఆ శాఖ అధికారులు తప్పనిసరిగా అనుమతి తీసుకుని పనులు చేయించాలి. అంతేగాకుండ కొత్తగా ఎవరైనా బోరు మోటార్‌కు కనెక్షన్ కావాలన్నా గ్రామ స్థాయిలో ఉండే లైన్‌మెన్ అతను కొత్తగా బోరు వేసుకున్నట్లు ధృవీకరణ చేస్తేనే ఆన్‌లైన్‌లో డీడీ కట్టుకోవచ్చు. ఇలాంటి సమస్యలు అధికారులు ఉంటేనే సాధ్యమవుతుంది.



పెద్దకొడప్‌గల్ సబ్‌స్టేషన్

పెద్దకొడప్‌గల్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా

కాటేపల్లి పీడర్ పరిధిలో కాటేపల్లి, అల్లాపూర్, పారడ్‌పల్లి గ్రామాలుంటాయి. ఈ గ్రామాలకు విద్యుత్ సరఫరా చేసే పీడర్‌కు సంబంధించి లైన్‌మెన్, జూనియర్ లైన్‌మెన్ లేక ఇబ్బందులు తలెత్తున్నాయని ఎన్నిసార్లు ఈ విషయం గురించి అధికారులకు ఫిర్యాదు చేసిన తమ సమస్యలు తీరడం లేదని ఆగ్రహించిన గ్రామస్థులు కొద్దిరోజుల కిందట పెద్దకొడప్‌గల్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. జూనియర్ లైన్‌మెన్ లేక విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిన పట్టించుకునే వారు కరువయ్యారని ఆరోపించారు. తమ సమస్యను పరిష్కరించేవరకు ఇక్కడి నుంచి కదలబోమని భీష్మించుకకూర్చున్నారు. దీంతో ఇన్‌చార్జి ఏఈ పవన్ సబ్‌స్టేషన్‌కు చేరుకుని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



ఆందోళన చేస్తున్న అల్లాపూర్ గ్రామస్థులు (ఫైల్)

సిబ్బంది లేక ఇబ్బందులు

పిట్లం విద్యుత్ శాఖ డీఈ పరిధిలో డీఈతో పాటు మూడు మండలాలకు చెందిన ఏఈలు ఖాళీగానే ఉన్నాయి. దీంతో పాటుగానే నియోజక వర్గంలో అచ్చంపేట్, అల్లాపూర్, హస్గుల్, పుల్కల్, వాజీద్ నగర్, బిచ్కుంద టౌన్, కాటేపల్లి, పెద్ద కొడప్‌గల్, చిన్న తక్కడ్‌పల్లి, తుప్దాల్, జగన్నాథ్‌పల్లి గ్రామాలకు సంబంధించిన లైన్‌మెన్లు లేరు. దీంతో ఆయా గ్రామాలలో విద్యుత్‌కు సంబంధించిన సమస్యలు వస్తే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీవల కాటేపల్లి తండాలో భారీ గాలులకు విద్యుత్ వైర్లు తెగి ఇంటిపై పడిపోయాయి. దీంతో తండావాసులు అధికారులకు సమాచారం అందించగా సరైన సిబ్బందిలేక సకాలంలో చేరుకోలేకపోయారు. ఇక పెద్దకొడప్‌గల్ మండలానికి విద్యుత్ సరఫరా చేసే సబ్‌స్టేషన్లు పెద్దకొడప్‌గల్, శివాపూర్ గ్రామాల పరిధిలో ఉంటాయి. ఇందులో ఒక్కో సబ్‌స్టేషన్‌లో ముగ్గురు ఆపరేటర్లు అవసరం ఉండగా పెద్ద కొడప్‌గల్‌లో ఇద్దరు, శివ్వాపూర్‌లో ఒకరు మాత్రమే ఉన్నారు. దీంతో సబ్‌స్టేషన్ల నిర్వహణ భారం అవుతుందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఖాళీలగా ఉన్న పోస్టులను భర్తీచేయాలని వినియోగదారులు కోరుతున్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

ఆలయంలో గోశాల నిర్మాణానికి భూమిపూజ

నిజామాబాద్ కల్చరల్, జూన్17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని న్యాల్‌కల్ రోడ్‌లోగల లలితాదేవి ఆలయంలో నూతనంగా నిర్మించతలపెట్టిన గోశాల భూమిపూజను మంగళవారం ప్రత్యేక పూజలతో ప్రారంభించారు. ఆలయ ధర్మాదికారి వేలేటి రాజేందర్‌శర్మ భక్తులచే గోశాలకు భూదాన పూజలు చేయించారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం వార్షిక పూజలో భాగంగా భూదాన మహాయజ్ఞాన్ని నిర్వహించి వార్షిక పూజలు చేయడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

చినుకు కురిసే.. మొలకలు మెరిసే!

పెద్దకొడప్‌గల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో ముందస్తు వానలు కురవడంతో రైతన్నలు ఆరుతడి పంటల కింద పత్తి, సోయా లాంటి పంటలలో నిమగ్నమయ్యారు. మండలంలో నల్లరేగడి భూములు ఉండటంతో ఎక్కువగా ఆరుతడి పంటలను సాగుచేస్తున్నారు. గత నెల కిందట వరకు బీడుగా ఉన్న భూములు నేడు రైతన్నలు సాగు చేసిన పంటలతో కళకళలాడుతున్నాయి. దీంతో ఎవరిపంట చేనులో చూసినా పచ్చని మొలకలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి.



పెద్దకొడప్‌గల్ శివారులో మొలకెత్తిన పత్తి పంట

ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతులు

● మాక్లూర్‌లో 19వేల ఎకరాల్లో వరి సాగు ● విత్తనాలు, ఎరువులను సిద్ధం చేసుకుంటున్న రైతులు



మండలంలో రైతులు సాగు చేస్తున్న పచ్చిరొట్ట



మాక్లూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రైతులు ఖరీఫ్ సాగుకు సమాయత్తం అవుతున్నారు. పంటల సాగుకు అవసరమైన వాటిని సిద్ధం చేసుకుంటున్నారు. మండలంలో 19,200 ఎకరాల్లో వరి సాగు, 20 నుంచి 30 ఎకరాల్లో మొక్కజొన్న సాగు కానున్నట్లు అంచనా ఉంది. గత సీజన్‌లో మాదిరిగానే ఈ సీజన్‌లో కూడా 5 నుంచి 10 శాతం పంట సాగు పెరిగే అవకాశాలున్నాయి. రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మండల పరిధిలో మాక్లూర్ విండో పరిధిలోని అమ్రాద్‌లో 425 జీలుగ బస్తాలు, మాక్లూర్‌లో 425, కల్లడిలో 100 బస్తాలు 50 శాతం సబ్సిడీపై ఒక్కో బస్తాకు రూ.2,138 చొప్పున 30 కేజీల బస్తాలను అందజేశారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు, వికసిత్ అభియాన్, రైతునేస్తం వంటి కార్యక్రమాల్లో వ్యవసాయశాఖ అధికారులు రైతులకు తమ పంటసాగుపై, విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేముందు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఎప్పటి కప్పుడు వివరిస్తున్నారు. ముఖ్యంగా రైతులు విత్తనాలు కొనేముందు ఆధీకృత డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలని విత్తనాలు కొన్న తర్వాత తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలని, విత్తనాలను వాడిన తర్వాత వాటి ప్యాకెట్‌లను భద్రపర్చుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఒకవేళ అవి నకిలీ విత్తనాలైన పక్షంలో సదరు డీలర్ల నుంచి నష్టపరిహారం వసూలు చేసేందుకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. పంటలకు అనుకూలంగా ఎరువులు ఎన్ని టన్నులు అవసరం ఉంటుందో ఎప్పటికప్పుడు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక సహకార సంఘాలకు ఇండెట్లను అందజేస్తున్నారు. అంతేకాకుండా ఎరువుల దుకాణాల అధికారులతోపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవసాయాధికారులు తనిఖీలు చేస్తూ నకిలీ విత్తనాలు అమ్మకుండా గట్టి చర్యలను చేపట్టారు. ఖరీఫ్ సీజన్‌కు ముందే రావడంతో రైతులు దుక్కులు దున్ని నారుమళ్లు తయారు చేసుకొని వరినాట్లకు సిద్ధం అవుతున్నారు.

పచ్చిరొట్ట సాగు చేస్తున్న రైతులు

పంటల సాగులో రసాయనిక ఎరువుల వాడకం పెరిగిపోవడంతో భూసారం తగ్గిపోతోంది. అంతేకాకుండా రైతులకు పెట్టుబడి భారం అధికమవుతోంది. దీన్నిదృష్టిలో ఉంచుకొని రైతులు పచ్చిరొట్ట సాగుచేసి రసాయనిక ఎరువులను తగ్గించేందుకు తమవంతు కృషి చేస్తున్నారు. పచ్చిరొట్ట సాగు చేస్తే రైతులకు రసాయనిక ఎరువుల మోతాదు వాడకం తగ్గి పెట్టుబడి ఆదా అవుతుంది. పచ్చి రొట్టను సాగుచేసి పూత దశలో భూమిలో కలియదున్నడం వల్ల పచ్చిరొట్టే ఎరువు నేల ఆరోగ్యాన్ని మెరుగుపర్చి భూమిని సారవంతం చేస్తుంది. తెగుల్లు, కలుపుమొక్కలను నియంత్రించడానికి ఇది ఎంతో సహాయపడుతుంది. నేల స్వభావానికి అనుకూలంగా పచ్చిరొట్టే ఎరువు వేయడంతో భూమిని సారవంతంగా మార్చవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచాం

● బూరోల్ల అశోక్, విండో చైర్మన్, మాక్లూర్



రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా పంటలకు సరిపడా ఎరువులను సిద్ధం చేసి ఉంచాం. మండలంలోని గుత్ప, డీకం పల్లి, కొట్టు ముకుల, చిక్లి, మాక్లూర్ గోదాంలలో యూరియా 20-20 ఎరువుల బస్తాలను సిద్ధం చేసి ఉంచాం. అవసరమైన రైతులు పొందాలని కోరుతున్నాం.



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

ఘనంగా కళాశాల వార్షికోత్సవ వేడుకలు

కామారెడ్డి టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని లక్ష్మీదేవి గార్డెన్‌లో సాందీపని డిగ్రీ కళాశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ నృత్యాలతో, ఆట పాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్‌లు హరిస్మరణ్‌రెడ్డి, జనార్ధన్ రెడ్డి, అశోక్‌రావు, బాలాజీరావు, రాజేశ్వర్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ సాయిబాబా, అకాడమిక్ ఇన్‌చార్జ్ మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి

కామారెడ్డి టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సురేష్ అన్నారు. సోమవారం డీఈవో కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు అడ్మిషన్ ఫీజు పేరిట వసూళ్లు, పుస్తకాలు అమ్మవద్దని నిబంధనలు ఉన్న పాఠశాల ప్రాంగణంలోనే పుస్తకాలు అమ్మకాలు జరుపుతున్నారని అన్నారు. అపార్‌మెంట్లలో పాఠశాలలు నడుపుతున్నారని ఏమైన ప్రమాదం జరిగితే విద్యార్థులు కిందికి రావాలంటే ఎలాంటి సౌకర్యాలు లేవని తెలిపారు. అసలు గవర్నింగ్ బాడి అనేది ఏ పాఠశాలలో లేదని విద్యాహక్కు చట్టానికి విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయికుమార్, శేఖర్, ప్రశాంత్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్‌లకు రిపోర్టు చేయాలి

కామారెడ్డి టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి) : స్పోర్ట్స్ స్కూల్ నాలుగవ తరగతి స్కూల్ ఎంపికల కోసం ఈనెల 19న 9 గంటలకు జడ్పీహెచ్‌ఎస్ గర్ల్స్ పాఠశాలలో రిపోర్టు చేయాలని ఎంఈవో ఎల్లయ్య తెలిపారు. గర్ల్స్ పాఠశాలలో పరీక్షలు నిర్వహించి జిల్లా స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గమనించాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల పరిశీలన

మహమ్మద్‌నగర్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ మండలం బంజపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో కస్తూర్బా గాంధీ విద్యాలయం, ప్రభుత్వ పాఠశాలలను పంచాయతీ కార్యదర్శి భీంరావు, కారోబార్ సాయిలు పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పాఠశాలలోని పిచ్చి మొక్కలను తొలగించి, శానిటేషన్ చేసి సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేశారు.

భూ భారతి సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

సదాశివనగర్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలో భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ప్రతి ఒక్కరూ భూ భారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సత్యనారాయణ అన్నారు. మండలంలోని ధర్మారావుపేటలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సమస్యలున్న భూ యజమానుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈ నెల 20 వరకు రెవెన్యూ సదస్సులు కొనసాగుతాయన్నారు. సమస్యపై దరఖాస్తు చేసుకుని పరిష్కారం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహీసల్దార్ తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

దోమకొండలో ఇంక్లూజివ్ ఎడ్యూకేషన్ డే

దోమకొండ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): దోమకొండ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, శివరాం మందిర్ పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంక్లూజివ్ ఎడ్యూకేషన్ డేను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైనా ఎంఈవో విజయ్‌కుమార్ మాట్లాడుతూ సాధారణ పిల్లలతో పాటు వైవిధ్య సామర్థాలు ఉన్న పిల్లలను పాఠశాలలో చేర్పించి వారి వ్యక్తిగత పురోగతికి తోడ్పడాలని తల్లిదండ్రులకు సూచించారు. అదేవిధంగా ప్రత్యేక ఉపాధ్యాయ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో దోమకొండ కాంప్లెక్స్ హెచ్‌ఎం రాధాలక్ష్మీ, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, యూపీఎస్ హెచ్‌ఎం మహేందర్, ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, ప్రభావతి, సంతోష్‌కుమార్, స్పెషల్ టీచర్స్ అనీల్‌కుమార్, ప్రశాంత్, నాగరాజు, దామోదర్, తదితరులు పాల్గొన్నారు.



గంప గోవర్ధన్‌ను పరామర్శిస్తున్న దృశ్యం

మాజీ ఎమ్మెల్యేకు బీఆర్‌ఎస్ నాయకుల పరామర్శ

భిక్కనూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండల కేంద్రంతో పాటుగా మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌ను పరామర్శించారు. ఇటీవల అస్వస్థకు గురై చికిత్స తీసుకోగా హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో పరామర్శించి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో భిక్కనూరు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భిక్కనూరు రెవెన్యూ సదస్సులో దరఖాస్తులను స్వీకరిస్తున్న దృశ్యం

రెవెన్యూ సదస్సులకు విశేష స్పందన : ఆర్డీవో

భిక్కనూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రెవెన్యూ సదస్సులకు గ్రామ గ్రామాన విశేష స్పందన వస్తుందని ఆర్డీవో వీణ అన్నారు. మంగళవారం భిక్కనూరు మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన రెండవ రోజు రెవెన్యూ సదస్సులో ఆర్డీవో పాల్గొని మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకురావడం జరిగిందన్నారు. ప్రతీ గ్రామంలో రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరుగుతుందని, భూ సమస్యలు ఉన్నవారు రెవెన్యూ సదస్సులకు హాజరై నేరుగా దరఖాస్తు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, నాయబ్ తహసీల్దార్ రోజ, ఆర్‌ఐ బాలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

భూ భారతి సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



ధర్మారావుపేటలో దరఖాస్తులను స్వీకరిస్తున్న దృశ్యం

సదాశివనగర్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలో భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ప్రతి ఒక్కరూ భూ భారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సత్యనారాయణ అన్నారు. మండలంలోని ధర్మారావుపేటలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహీసల్దార్ తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

రామారెడ్డి: భూ భారతి ద్వారా రైతులు, ప్రజలు భూ సమస్యలను పరిష్కరించుకోవాలని రామారెడ్డి తహసీల్దార్ ఉమలత పేర్కొన్నారు. రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామ సమావేశంలో సమస్యల పరిష్కారం మంగళవారం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం భూ భారతి సర్వే ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కిష్టయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవికాంత్, సీనియర్ అసిస్టెంట్ విద్యా సాగర్, పంచాయతీ కార్యదర్శి, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్, రెవెన్యూ సిబ్బంది, రైతులు, ప్రజలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్: భూ భారతితో సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని మద్నూర్ తహసీల్దార్ అన్నారు. మంగళవారం మండలంలోని గోజేగావ్‌లో భూ భారతి రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించి వారితో మాట్లాడారు. భూమి ఉన్న ప్రతీ రైతుకు భూ హక్కు కల్పించాలని ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని రూపొందించింది అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శివాజీ రాథోడ్, రైతులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు భూ భారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తాహసీల్దార్ సువర్ణ అన్నారు. నస్రులాబాద్ మండలంలోని నాచుపల్లి గ్రామంలో రెవెన్యూ అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ సువర్ణ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ బావయ్య, గిర్దావర్ వెంకటస్వామి, సీనియర్ అసిస్టెంట్ ప్రియాంక, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మద్నూర్: భూ భారతితో సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని మద్నూర్ తహసీల్దార్ అన్నారు. మంగళవారం మండలంలోని గోజేగావ్‌లో భూభారతి రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించి వారితో మాట్లాడారు. భూమి ఉన్న ప్రతీ రైతుకు భూ హక్కు కల్పించాలని ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని రూపొందించింది అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శివాజీ రాథోడ్, రైతులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల నిర్వహణపై ఎన్‌ఎంసీ అసంతృప్తి

(5వ పేజీ తరువాయి)

ఇంకా కొనసాగుతున్న నిర్మాణ పనులు

ఎన్‌ఎంసీ నిబంధనలకు అనుగుణంగా జిల్లా కేంద్రంలోని దేవునిపల్లి పీహెచ్‌సీ ముందు కొత్త మెడికల్ కళాశాల భవన నిర్మాణం రూ.130 కోట్ల అంచనా వ్యయంతో 2023లో మొదలైంది. ప్రసుత్తం ఆ వ్యయం రూ.110 కోట్లకు మారిందని సమాచారం. ఈ నిర్మాణ పనులు ఇంకా కొనసాగుతునే ఉన్నాయి. ప్రస్తుతం మెడికల్ కళాశాల భవనం, బాలికల వసతి గృహ నిర్మాణ పనులు దగ్గర పడిన, బాలుర వసతి గృహ పనులు పిల్లర్ల స్టేజ్‌లోనే ఉంది. మరో 6 నుంచి 8 నెలలు వరకు నిర్మాణ పనులు కొనసాగే అవకాశం ఉందని సమాచారం. ఈ పనులు ఎంత త్వరగా పూర్తయి ఎంసీహెచ్ భవనం ఖాళీ అవుతే అంత త్వరగా జిల్లా కేంద్రంలోని స్టేషన్ రోడ్డులో ఉన్న జనరల్ ఆసుపత్రి ఇక్కడికి షిఫ్ట్ అయ్యే అవకాశం ఉంటుంది. ఇప్పటికే ఆసుపత్రిపై లోడ్ పెరిగిపోయి రోగులు, సిబ్బంది సైతం అనేక ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు.

ఈ ఏడాది మరో 100 మంది విద్యార్థుల రాక

గత మూడేళ్లుగా కళాశాల కొనసాగుతుండగా ఇప్పటికే రెండు బ్యాచ్‌లు పూర్తయ్యాయి. ఈ ఏడాది మరో 100 మంది విద్యార్థులు వస్తున్నారు. దీంతో కళాశాలలో 300 మంది విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించనున్నారు. హాస్టల్ భవనాలు సైతం సరిపోకపోవడంతో ఇతర చోట్ల చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మెడికల్ కళాశాల వద్ద కొనసాగుతున్న నిర్మాణ పనులు మరో 6 నుంచి 8 నెలల వరకు కొనసాగి అవి అందుబాటులోకి వచ్చేసరికి మరో ఏడాది పడితే ఇంకో బ్యాచ్ వచ్చే అవకాశం లేకపోలేదు. నేడు జరగనున్న సమావేశంలో ఎన్‌ఎంసీ రాష్ట్ర అధికారులు ఏప సూచనలు చేస్తుంది. ఆ సూచనల ప్రకారం ప్రభుత్వం, రాష్ట్ర, జిల్లా అధికారులు ఏ విధంగా ముందుకువెళ్తారనేది వేచి చూడాలి.

సామాజిక తనిఖీని నిర్వహించాలి

● మండల అభివృద్ధికి అధికారి సయ్యద్ సాజీద్ అలీ

తాడ్వాయి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో 16వ విడత సామాజిక తనిఖీని పకడ్బందీగా నిర్వహించి పూర్తిస్థాయిలో అందరూ సహకరించాలని ఎంపీడీవో సాజిద్ అలీ అన్నారు. ఈ మేరకు మంగళవారం తాడ్వాయి మండల కార్యాలయంలో సామాజిక తనిఖీ బృందం సభ్యులతో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 సంవత్సరానికి సంబంధించి చేపట్టిన ఉపాధి హామీ పనులకు తనిఖీలు నిర్వహించేందుకు తనిఖీ బృందం సభ్యులు వచ్చారని వారికి పూర్తిస్థాయిలో క్షేత్ర సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు ఉపాధి హామీ సిబ్బంది సహకరించి తనిఖీని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సవిత, ఏపీవో కృష్ణాగౌడ్, సామాజిక తనిఖీ ఎస్ఆర్పీ సాంబశివ చారి, డీఆర్పీలు మహేష్, అనిల్, సాయికుమార్, మనుష, సంధ్య, శైలజ, టీఏ మహిపాల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

పేదోడి సొంతింటి కల నెరవేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

సదాశివనగర్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే మదన్‌మోహన్ ప్రత్యేక చొరవతో మండలంలోని పేదోడి సొంతింటి కల నెరవేరుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు మద్దెల బాగయ్య అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఎమ్మెల్యే అనుమతితో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గాదారి శ్రీనివాస్‌రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బాల్‌రాజు, చిన్నమణి రాజయ్య, పాపసుల బీరయ్య, జంగం ప్రభుస్వామి, కుమ్మరి రాజు, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ

గాంధారి, జూన్ 17(ఆంధ్రజ్యోతి): గాంధారి మండల కేంద్రంలోని భవిత సెంటర్‌లో వికలాంగుల విద్యార్థులకు ఫిజియోథెరపీ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏ విధంగా పరికరాలను వినియోగించుకోవాలనే దానిపై దివ్యాంగ పిల్లలకు సూచించారు. వికలాంగ విద్యార్థులకు వారి తల్లిదండ్రులు ఫిజియోథెరపీ చేయించాలని అన్నారు. ప్రభుత్వం వారానికి రెండుసార్లు ఫిజియోథెరపీ నిర్వహిస్తుందని అన్నారు. అనంతరం పదో తరగతిలో ఉత్తీర్ణులైన ప్రవీణ్ దివ్యాంగ విద్యార్థిని ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీహరి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, విజయ్, పెంటయ్య, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సంఘం పదాధికారులకు శిక్షణ

దోమకొండ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): దోమకొండ మండల మహిళా సమాఖ్య పరిధిలోని గ్రామసంఘం పదాధికారులకు మంగళవారం దోమకొండ ఐకేపీ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సీఆర్పీలు పదాధికారుల విధులు, ఆర్థిక లావాదేవీల నిర్వహణ, సంఘ సమావేశాలు, పుస్తక నిర్వహణ, జీవనోపాదుల పెంపుదల అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ మేరకు ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ మండలంలో మహిళా సంఘాల బలోపేతానికి, ఆర్థికంగా ఎదుగుదలకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రాజు, సీసీఉల, సీఆర్పీలు, మహిళా సంఘం పదాధికారులు పాల్గొన్నారు.

20న దిశా సమావేశం

కామారెడ్డి టౌన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి కలెక్టరేట్‌లో శుక్రవారం ఉదయం 11 గంటలకు దిశా సమావేశం నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఓ పీడీ సురేందర్ తెలిపారు. ఎంపీ సురేష్ షెట్కార్ ఆధ్వర్యంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలుచేయబడుతున్న అభివృద్ధి పథకాలపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా ఎమ్మెల్యేలు, అధికారులు హాజరు కావాలని తెలిపారు.

మంత్రి సీతక్కకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడి సన్మానం



సీతక్కను సన్మానిస్తున్న దృశ్యం

భిక్కనూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి, మంత్రి సీతక్కను మంగళవారం సెక్రటేరియట్‌లోని తన కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ భిక్కనూరు మండల అధ్యక్షుడు తిరుపరి భీంరెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా భీంరెడ్డి మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మంత్రి దిశా నిర్దేశం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఇళ్లను నిర్మించుకుంటేనే బిల్లులు అందుతాయి

బిచ్కుంద, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు మంజూరై నిర్మించుకుంటేనే లబ్ధిదారులు వారికి బిల్లులు అందుతాయని ఎంపీడీఓ గోపాల్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని పెద్ద తక్కడ్‌పల్లి, శాంతాపూర్ పంచాయతీ పరిధిలో నిర్మాణం అవుతున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ పథకం ద్వారా ఇళ్లులేని వారు దరఖాస్తు చేసుకోగా విచారణ చేపట్టి మంజూరు చేయడం జరిగిందన్నారు. మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో మొదటి దఫాలో 592 ఇళ్లు మంజూరు కాగా ఇందులో 183 ఇళ్లకు ముగ్గుపోయగా 85 నిర్మాణం అవుతున్నాయని తెలిపారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించండి

రామారెడ్డి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు సదాశివనగర్ మండల కేంద్రంలో ఉన్న మోడల్ స్కూల్ వెళ్లడానికి బస్సు సౌకర్యం కల్పించాలని డిపో మేనేజర్ కరుణశ్రీ మంగళవారం వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సదాశివనగర్ మండల మాజీ జడ్పీటీసీ పడిగెల రాజేశ్వర్‌రావు, గొల్లపల్లి గ్రామ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రెడ్డి మల్లేష్, ఉపాధ్యక్షుడు కె. నరేష్, జె. రాజేశ్వర్ తదితరులు కలిసి వినతి పత్రం అందజేశారు.

యూనిఫాంలను సద్వినియోగం చేసుకోవాలి

● ఐకేపీ ఏపీఎం ప్రసన్నకుమార్

రామారెడ్డి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యార్థులకు పాఠశాల యూనిఫామ్‌లను పంపిణీ చేయడం చాలా సతోషకరమని రామారెడ్డి ఐకేపీ ఏపీఎం ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో విద్యార్థినులకు ఉచితంగా పాఠశాల యూనిఫాంలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా యూనిఫాంలు పంపిణీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రిన్సిపాల్ వనిత, ఐకేపీ ప్రతాప్, ఉపాధ్యాయులు శ్రీదేవి, పద్మ, అనూష, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ అభివృద్ధి కోసం కృషి చేస్తా..

● ఏఎంసీ చైర్మన్ శ్యామల

బీర్కూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఏఎంసీ చైర్మెన్ దుర్గం శ్యామల అన్నారు. మంగళవారం బీర్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్యామల అధ్యక్షతన పాలక వర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. అలాగే తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ చైర్మెన్ యామ రాములు, డైరెక్టర్లు ఇక్బాల్, సాయిలు, హన్మంతు రెడ్డి, రాంబాబు, మారుతి రెడ్డి, సంగ్యా నాయక్, సెక్రటరీ పాతిమా రూహి, తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలన అభివృద్ధిపై పోస్టర్ల ఆవిష్కరణ



లింగంపేటలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

లింగంపేట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రధాని మోదీ 11సంవత్సరాల కాలంలో చేసిన అభివృద్ధి పనులపై మంగళవారం బీజేపీ మండలశాఖ నాయకులు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు బొల్లారం రాజ్‌కుమార్ మాట్లాడుతూ మోదీ 11 సంవత్సరాల్లో చేసునటువంటి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు రజినీకాంత్, నాయకులు రామచంద్ర చారీ, కుమ్మరి శ్రీకాంత్, ఉదయ్, నవీన్‌కుమార్, బాలయ్య, రాందాస్, సుభాష్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

మాచారెడ్డి: కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కామారెడ్డి జిల్లా ఇంచార్జి రవియాద్ అన్నారు. మంగళవారం పాల్వంచ, మాచారెడ్డి మండలాలలో ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, కామారెడ్డి ఎమెమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆదేశాల మేరకు ప్రధానిగా 11సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సంకల్ప సహాకారం కార్యక్రమంలో బాగంగా రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుస సురేష్, నాయకులు వెంకన్నగౌడ్, రాజన్న, లక్ష్మీపతి, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి



గడ్డం నారాయణ(ఫైల్)

తాడ్వాయి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందాపూర్ గ్రామంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినట్లు ఎస్సై మురళీ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. చందాపూర్ గ్రామానికి చెందిన గడ్డం నారాయణ(69) పంట చేనులో గేదెలను మేపడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి మృతి చెందినట్లు తెలిపారు. అతని కుమారుడు గడ్డం రణదీప్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కారును ఢీకొని ఒకరి మృతి



గంజి అంజయ్య (ఫైల్)

ఎల్లారెడ్డి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కారును ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరి మృతి చెందిన సంఘటన ఎల్లారెడ్డిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహమ్మద్ నగర్ మండలంలోని హసన్‌పల్లి గ్రామానికి చెందిన గంజి అంజయ్య (29) మధ్యాహ్నం ఇంటి నిర్మాణ సామగ్రి కొనుగోలు కోసం ద్విచక్ర వాహనంపై ఎల్లారెడ్డి వెళుతుండగా పట్టణ సమీపంలోని ఎల్లారెడ్డి-బాన్సువాడ ప్రధాన రహదారిపై ఎదురుగా వస్తున్న కారును ఢీ కొనడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న అంజయ్యకు తీవ్ర గాయాలు కాగా ఎల్లారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బలమైన గాయాలు తగలడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు.

ఎల్లారెడ్డి డిగ్రీ కళాశాలకు కొత్త కోర్సు మంజూరు

ఎల్లారెడ్డి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కొత్త కోర్సు ఫార్మా స్యూటికల్ మ్యాన్యు ఫ్యాక్చరింగ్ అండ్ క్వాలిటీ కోర్సు మంజూరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఇతర డిగ్రీ కోర్సుల అడ్మిషన్ల కోసం సంబంధించి మూడో దశ దోస్త్ అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందని ఇంటర్మీడియట్ పూర్తి అయిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాలలో విద్యార్థులకు సరిపడా అన్ని సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు.

వరద కాలువలో పోసిన మట్టిని తొలగించాలి

ఎల్లారెడ్డి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగారెడ్డిపేట్ ఊర చెరువుకు వచ్చే వర్షపు వరద కాలువలో పోసిన మట్టిని తొలగించాలని మంగళవారం అటవీ అధికారులకు రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షానికి వర్షపు నీరు వచ్చే కట్టు కాలువ వద్ద ఫారెస్టు అధికారులు నిర్మిస్తున్న అర్బన్ పార్కు నిర్మాణ పనులు జరగడంతో కాలువలో మట్టి పోసి పూడ్చడం వల్ల వర్షపు నీరు నిలిచిపోతుందని కాలువలో సిమెంట్ పైపులు వేసి పూడ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు అటవీ శాఖ అధికారులను కోరారు.

స్పోర్ట్స్ పాఠశాలలో ప్రవేశాలకు విద్యార్థుల ఎంపిక

పిట్లం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్పోర్ట్స్ పాఠశాలలో నాలుగో తరగతి ప్రవేశం కోసం స్థానిక ఉన్నత పాఠశాలలో బుధవారం సెలక్షన్ కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు ఎంఈవో దేవీసింగ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ 1.9.2016 నుంచి 31.8.2017 మధ్యలో జన్మించిన విద్యార్థులు అర్హులని తెలిపారు. అర్హులైన వారు ఒర్జినల్ ధ్రువ పత్రాలతో బుధవారం మధ్యాహ్నం 2 గంటల వరకు హాజరు కావాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అక్షరభ్యాసం

పిట్లం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అక్షరభ్యాసం చేయిస్తామని సీడీపీవో సౌభాగ్య తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని కారెగాం, చిన్నకొడప్‌గల్, సెక్టార్‌ల పరిధిలోని అంగన్‌వాడీ సెంటర్ నందు అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అక్షరభ్యాసం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మావతి, టీచర్ అనురాధ, ఆశావర్కర్ బాలమణి, పాల్గొన్నారు.

బీర్కూర్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరం

బీర్కూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలోని లయన్స్ భవనంలో మంగళవారం నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో లయన్స్ డాక్టర్ సతీష్ కంటి చూపు సమస్యతో బాధపడుతున్న 25 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో ముగ్గురికి మోతీ బిందు ఉన్నట్లు వైద్యుడు నిర్ధారించాడు. వీరిని శస్త్ర చికిత్సల నిమిత్తం బోధన్ లయన్స్ ఆసుపత్రికి తరలించనున్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షుడు గాలయ్య, సభ్యులు విఠల్, కిషోర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన పోలీసు అధికారులు

బీర్కూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో ఇటీవల పెద్ద ఎత్తున బదిలీలు జరిగాయి. అయితే బీర్కూర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న పలువురు పోలీసు సిబ్బందిపై ఇతర ప్రాంతాలకు వెళ్లారు. ఇదిలా ఉండగా బీర్కూర్‌కు ఇద్దరు ఏఎస్సైలు బదిలీపై వచ్చారు. బిచ్కుంద పోలీస్‌స్టేషన్ నుంచి శంకర్, దేవునిపల్లి పోలీస్‌స్టేషన్ నుంచి అమ్రులు బదిలీపై ఏఎస్సైలుగా బీర్కూర్‌కు వచ్చారు. వీరు మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు.

తాగు నీటిని క్లోరినేషన్ చేసి సరఫరా చేయాలి

బీర్కూర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం దృష్ట్యా ప్రతిరోజూ తాగు నీటిని క్లోరినేషన్ చేసి సరఫరా చేయాలని డీఈ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన బీర్కూర్ మండలంలోని వీరాపూర్, భైరాపూర్ గ్రామాల్లో పర్యటించి వాటర్ ట్యాంక్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాటర్ ట్యాంక్‌ల చుట్టూరా శుభ్రంగా తీర్చిదిద్దాలని అన్నారు. నీటి సరఫరా పైపులు లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేయించాలన్నారు. ప్రతిరోజూ తాగు నీటిని క్లోరినేషన్ చేసి సరఫరా చేయాలనీ సూచించారు. ఆయన వెంట డీఈ వెంకటేశ్వర్, ఏఈ జగదీష్, జీపీ కార్యదర్శులు దివ్య, అనిత ఉన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్ - కరాటే కిడ్
ప్రియా 70 - భైరవం
ప్రియా 35 - తొలిప్రేమ

బాన్సువాడ

మహేశ్వరి - థగ్ లైఫ్
వెంకటేశ్వర - శ్రీశ్రీశ్రీరాజావారు